సాక్షి చిత్తూరు

మంగళవారం ၊ 28 ၊ మార్చి ၊ 2023



కూల్..కూల్

తిరుమల : ఎండలతో భక్తులు ఇబ్బందిపడకుండా టీటీడీ చర్యలు చేపట్టింది. ఆలయం ఎదుట భక్తుల కాళ్లు కాలకుండా వాహనాల ద్వారా నీళ్లు చల్లిస్తోంది.



జగన్‌మామ నీకు వందనం

పిచ్చాటూరు: ఎస్‌ఎస్‌పురం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. 'జగన్ మామ' పాటకు విద్యార్థుల నృత్యం విశేషంగా ఆకట్టుకుంది.



పోషకాహార పక్వాడ

పులిచెర్ల(కల్లూరు): ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం పోషకాహార పక్వాడలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. పోషకాహార ముగ్గు ఆకట్టుకుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం(సా)	సహర్ బుధవారం(ఉ)
తిరుపతి	6.27	4.52
చిత్తూరు	6.29	4.51
పుంగనూరు	6.31	4.54

న్యూస్‌రీల్

పంట పొలాలపై ఏనుగుల దాడి



ఏనుగులు తొక్కేసిన వరి పంట

బైరెడ్డిపల్లె : మండలంలో ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. దేవదొడ్డి, కూటలవంక గ్రామాల్లోని రైతులు సాగు చేస్తున్న వరి, రాగి, టమాట పంటలను తొక్కి నాశనం చేసింది. గ్రామస్తులు టపాకాయలు కాలుస్తూ ఏనుగుల గుంపును దారి మళ్లించేందుకు యత్నించారు. గజరాజుల దాడిలో తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు గురుమూర్తి, భాస్కర్, వెంకటేష్, రియాజ్, గౌస్‌బాషా, సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసు స్పందనకు 17 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 17 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

కార్వేటినగరం : నేర నియంత్రణపై పోలీసు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కార్వేటినగరం పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. వేసవి నేపథ్యంలో రాత్రిపూట కట్టుదిట్టంగా గస్తీ చేపట్టాలన్నారు. సర్కిల్ పరిధిలో నేరాలను అదుపు చేసినందుకు సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ దస్తగిరిని, ఇటీవల ఎస్‌ఆర్‌పురం మండలం క్షీరసముద్రంలో జరిగిన భారీ చోరీ కేసును ఛేదించినందుకు డీఎస్పీ రవికుమార్, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డిని అభినందించారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట మహాత్మా జ్యోతీబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జోత్స్న తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈబీసీ, బీసీలకు 11 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీలకు 13 ఏళ్ల వయసువారు దరఖాస్తుకు అర్హులన్నారు. ఓఎంఆర్ పద్ధతిలో 50 మార్కులకు తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందని వెల్లడించారు. ఏప్రిల్ 4వ తేదీలోపు ఆన్‌లైన్‌లో mjpbcwreis. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9515764818 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కుప్పం అభివృద్ధిపై చర్చ

చిత్తూరు కలెక్టరేట్ : కుప్పం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్సీ భరత్ సోమవారం చిత్తూరులో జేసీ వెంకటేశ్వర్‌తో చర్చించారు. పేదలకు పంపిణీ చేయాల్సిన ఇంటి స్థలాలకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

రేపటి నుంచి పంగుణోత్తర కల్యాణోత్సవం

నగరి : పట్టణంలోని కామాక్షీ సమేత కరకంటేశ్వర ఆలయంలో బుధవారం నుంచి పంగుణోత్తర కల్యాణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 29వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, తొలిరోజు సూర్యప్రభవాహనం, 30న చంద్రప్రభ వాహనం, ఏప్రిల్ 1వ తేదీన శేష వాహనం, 2న వృషభ వాహనం, 3న గజవాహనం, 4న రథోత్సవం, 5న కల్యాణోత్సవం, 6వ తేదీన రావణేశ్వర వాహనం సేవలు ఉంటాయని వివరించారు.

సేద్యంలో రాణి

- సేంద్రియ వ్యవసాయంలో సత్తా చాటుతున్న పట్టభద్ర మహిళలు
- ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా స్వయం కృషితో ముందుకు
- పొలం లీజుకు తీసుకుని కొందరు, సొంత భూమిలో మరికొందరు సేద్యం
- ఆరోగ్యాన్ని అందిస్తూ, లాభాలు ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న వైనం

ఒకప్పుడు ఒంటింటి కుందేళ్లుగా పేరుగడించిన మహిళలు ఇప్పుడు ఆకాశమంత ఎత్తుకు ఎదిగారు. అవనిలో సగం.. ఆకాశంలో సగం.. అంటూ అత్యుత్తమంగా రాణిస్తున్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమకు ఇష్టమైన రంగాలను ఎంచుకుని ఎంచక్కా రాణించేస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని ప్రకృతిసేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. ఎలాంటి రసాయన అవశేషాలు లేని అమృత ఆహారాన్ని పండిస్తూ.. అందరికీ ఆరోగ్యాన్ని పంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఓ వైపు కుటుంబానికి అండగా ఉంటూ.. మరో వైపు ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ అబలలు కాదు.. సబలలమని నిరూపిస్తున్నారు.. ఉమ్మడి జిల్లాలోని పట్టభద్ర మహిళలు.. వీరు చేస్తున్న వ్యవసాయం, కుటుంబ నేపథ్యం తదితరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– సాక్షి, తిరుపతి





సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆకు కూరలు, కూరగాయలు

ఆరోగ్యాన్ని అందరికీ పంచుతూ..



సేంద్రియ పద్ధతుల్లో సాగుచేసిన కూరగాయతోటలో రైతులు



శ్రీదేవి

వడమాలపేట మండలం, ఎస్‌బీఆర్‌పురానికి చెందిన శ్రీదేవి డిగ్రీ పూర్తిచేశారు. ఉద్యోగం కోసం ఎదురు చూడలేదు. ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు విఫలమైనా కుంగిపోలేదు. తమకున్న ఏడెకరాల పొలంలో సేంద్రియ పద్ధతులతో మామిడి సాగుచేస్తున్నారు. మరో ఎకరం పొలం లీజుకు తీసుకుని అందులో టమాట, ఉల్లి, బెండ, వంగ, ముల్లంగి, పచ్చిమిర్చి, మొక్కజొన్న, వివిధ రకాల కూరగాయల సాగుచేస్తున్నారు. స్కూలు, అంగన్‌వాడీ పిల్లల మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే కూరగాయలను అందిస్తున్నారు. పిల్లల ఆరోగ్యానికి తమవంతు సహకారం అందిస్తున్నారు. వీరికి పోను మిగిలిన కూరగాయలను తిరుపతికి తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. భర్త ఇద్దరు పిల్లలతో హ్యాపీగా జీవనం సాగిస్తున్నారు.

వసుదైక కుటుంబానికి పసందైన వంటకాలు





వరలక్ష్మి

పలమనేరు మండలం, మొరం గ్రామానికి చెందిన వరలక్ష్మి బీటెక్ పూర్తి చేశారు. భర్త ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుండగా ఆమె ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేశారు. పుట్టింది, పెరిగింది వైఎస్సార్ కడప జిల్లా, గాలివీడు వడిసలవంకపల్లెలో అయినా.. భర్త తరుపు అన్నదమ్ములంతా కలిసే ఉంటున్నారు. పిల్లలు, పెద్దలు అంతా కలిపి 30 మంది వరకు ఉంటారు. రెండెకరాల పొలంలో పది రకాల పంటలు సాగుచేయడం ప్రారంభించారు. కుటుంబ అవసరాలకు పోను మిగిలిన వాటిని గ్రామంలోనే విక్రయిస్తుంటారు. మహాగణి కాయలు ఆయుర్వేద వైద్యం కోసం పెంచుతున్నట్లు వరలక్ష్మి తెలిపారు.

నేచురల్‌గా ముందుకు సాగాలని..



కల్పన



పంట పొలంలో కల్పన

చిత్తూరు జిల్లా, రొంపిచర్ల మండలం, బెస్తపల్లెకు చెందిన కల్పన ఎంకాం, బీఈడీ, డీఈడీ పూర్తిచేశారు. ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు విఫలమవ్వడంతో వ్యవసాయం వైపు మొగ్గుచూపారు. నేచురల్ ఫామింగ్‌లో చేరారు. అక్కడ ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తీసుకుంటున్నారు. తాను నేర్చుకున్న విద్యను ఆచరణలో చూపాలనుకుని.. ఏడాది క్రితం గ్రామంలోనే అర ఎకరా లీజుకు తీసుకుని సాగుచేయడం ప్రారంభించారు. అందులో నవధాన్యాలు, జొన్న, మొక్కజొన్న, మిరప, వంగ, ఉల్లి, మునగ, టమాట, కొత్తిమీర, వివిధ రకరకాల ఆకు కూరలు సాగుచేస్తున్నారు. చిన్నాన్న కేశవులు సాయంతో పండించిన కూరగాయాలను మార్కెట్లో విక్రయిస్తున్నారు.

ప్రకృతి సాగు..భలే బాగు



రేఖ



ఐరాల మండలం, మిట్టూరుకు చెందిన రేఖ ఎంఏ, ఎంఈడీ పూర్తిచేశారు. ఉద్యోగం కోసం ఎదురుచూడలేదు. ఉన్న భూమిలో ప్రకృతి సాగుచేయాలని భావించారు. మొత్తం పది ఎకరాల పొలం ఉంటే.. అందులో మూడు ఎకరాలను ప్రకృతి సాగు కోసం కేటాయించారు. మిగిలిన భూమిలో మామిడి సాగు చేస్తున్నారు. మూడెకరాల్లో వరి, వేరుశనగ, చిరుధాన్యాలు, వివిధ రకాల కూరగాయలు సాగుచేస్తున్నారు. సేంద్రియ పద్ధతుల్లో పండిస్తున్న పంట ఉత్పత్తులను కొనుగోలు చేసుకునేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారని ఆమె సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట



104 వాహనాలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వద్ద జిల్లాకు మంజూరైన నూతన 104 వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. జేసీ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 44 వాహనాల ద్వారా ప్రజలకు సత్వరమే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా 'పది' పరీక్షలు



డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షలను ఎలాంటి తప్పులకు తావులేకుండా ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. సోమవారం ఈ మేరకు పరీక్షల నిర్వహణపై డీఈఓకు పలు సూచనలు చేశారు. దీనిపై డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్లు, నామినల్ రోల్స్‌లో ఏమైనా తప్పులుంటే సవరణకు అవకాశం కల్పించామన్నారు. హాల్‌టికెట్లను ప్రధానోపాధ్యాయులు సైతం పరిశీలించాలని, వారి నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు నష్టం వాటిల్లితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

- ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరిగే పరీక్షలకు సంబంధించి రోజువారీ సబ్జెక్టులను తెలుసుకునేందుకు టైమ్‌టేబుల్‌ను తప్పనిసరిగా చూసుకోవాలి.
- విద్యార్థులు ఉదయం 8:45 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.
- హాల్‌టికెట్‌ను తప్పనిసరిగా తీసుకెళ్లాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉంచుకోకూడదు.
- పరీక్ష కేంద్రం నుంచి 12:45 గంటల లోపు ప్రశ్నపత్రాన్ని బయటకు తీసుకెళ్లకూడదు.
- ఓఎంఆర్ షీట్‌లో వివరాలను సరిచూసుకున్న తర్వాతే జవాబులు రాయాలి.
- పెన్ను, పెన్సిళ్లను వెంట తెచ్చుకోవాలి. ఆహారపదార్థాలు అనుమతించబడవు.

ఆడపడుచుల అభ్యున్నతికి 'ఆసరా'



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- చంద్రబాబు మోసపు మాటలను ప్రజలు నమ్మరు
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి రోజా

శ్రీరంగరాజపురం/పుత్తూరు రూరల్ : ఆడపడుచుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలు అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. సోమవారం ఎస్‌ఆర్‌పురంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడోవిడత నగదు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాల ద్వారా కనీసం రూ.3లక్షల నుంచి రూ.15లక్షల వరకు లబ్ధిపొందారని వెల్లడించారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఎప్పుడైనా ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టారా అని ప్రశ్నించారు. 2024లో అధికారం చేపట్టాలని తాపత్రయ పడుతున్న చంద్రబాబు ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తామని చెప్పగలరా అని సవాల్ విసిరారు. 2016లో ఆగిపోయిన సున్నావడ్డీ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అనంతరెడ్డి, సర్పంచ్ హరిత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, ఏపీఎం రోజా పాల్గొన్నారు.

జగనన్నకే మళ్లీ పట్టాభిషేకం

సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు మళ్లీ పట్టాభిషేకం చేస్తారని మంత్రి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. సోమవారం పుత్తూరులో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడోవిడత చెక్కుల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. సుమారు 11,897 మంది లబ్ధిదారులకు గాను రూ.11.27 కోట్ల చెక్కును అందజేశారు. మంత్రి రోజా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ ఆడపడుచుల పేరిటే అమలు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారని విమర్శించారు. అదేవిధంగా 2019 ఎన్నికల్లో కూడా మోసం చేసేందుకు యత్నిస్తారని, అయితే బాబు కల్లిబొల్లి మాటలను ఎవరూ నమ్మరని స్పష్ట చేశారు. అవినీతి రాజకీయాలకు అలవాటు పడిన చంద్రబాబు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు ఎమ్మెల్యేను కొనుగోలు చేశారని ఆరోపించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును తగిన బుద్ధి చెప్పి హైదరాబాద్‌కు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ప్రతి మహిళా జగనన్నకు అండగా నిలవాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా జిల్లా అధికారి శ్రీరాములు, మెప్మా సిటీ మేనేజర్ ప్రమీలా, మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి, ఎంపీడీఓ ఇందిర, మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ శంకర్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్ పాల్గొన్నారు.

జయజయరామ.. జానకిరామ

- వైభవంగా కోదండరాముని రథోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ఉదయం స్వామి వారి రథోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి రథాన్ని అధిష్టించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. డప్పు వాయిద్యాలు, భజన బృందాల కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అడుగడుగునా భక్తులు కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రథం నాలుగు మాడ వీధుల్లో ఊరేగి యథాస్థానానికి చేరిన తర్వాత ప్రబంధం, వేద శాత్తుమొర నిర్వహించి హారతి సమర్పించారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహించారు. రాత్రి స్వామివారి అశ్వవాహన సేవ వేడుకగా సాగింది. పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్నం, ఈఈలు వేణుగోపాల్, శివరామకృష్ణ, మురళీకృష్ణ, కృష్ణారెడ్డి, డీఈ చంద్రశేఖర్, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, కంకణభట్టర్ ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి పాల్గొన్నారు.



అశ్వవాహనంపై ఊరేగుతున్న కోదండరామస్వామి



కోలాహలంగా రథోత్సవం

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చక్రస్నాన ఘట్టాన్ని వేడుగా నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు కపిలతీర్థం పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరగనుంది.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో ఈ నెల 19వ తేదీన జరిగిన యువకుడి హత్యకేసులో నిందితులను సోమవారం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నరసింహరాజు కథనం మేరకు.. ప్రశాంత్‌నగర్‌కు చెందిన శివకుమార్(21) వడ్రంగి పనిచేస్తూ పొట్టపోసుకునేవాడు. అతడికి చామంతిపురానికి చెందిన ఎలక్ట్రీషియన్ శివ, తోటపాళ్యానికి చెందిన మెకానిక్ రాజ్‌కుమార్ స్నేహితులు ఉన్నారు. ఈ క్రమంలో శివకుమార్‌కు తన భార్యతో వివాహేతర సంబంధం ఉందని శివ అనుమానించాడు. ఈ విషయాన్ని రాజ్‌కుమార్ చెప్పాడు. తర్వాత పథకం ప్రకారం రాజ్‌కుమార్‌తో కలిసి శివకుమార్‌ను తీసుకుని కట్టమంచి రైల్వే బ్రిడ్జి వద్దకు వెళ్లాడు. అక్కడ ముగ్గురూ మద్యం సేవించారు. రాత్రి 11 గంటల సమయంలో శివ, రాజ్‌కమార్ కలిసి రాళ్లతో శివకుమార్‌పై దాడి చేసి వెళ్లిపోయారు. రక్తపుమడుగులో పడి ఉన్న శివకుమార్‌ను మరుసటి రోజు ఉదయం 6 గంటలకు స్థానికులు గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం శివకుమార్‌ను చెన్నైలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 23వ తేదీన బాధితుడు మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితులను గుర్తించారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలిచామని సీఐ వివరించారు.

పెనుమూరు తహసీల్దార్ బదిలీ

చిత్తూరు కలెక్టరేట్ : పెనుమూరు తహసీల్దార్ సురేష్‌బాబును బదిలీ చేస్తూ కలెక్టరేట్ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు పెనుమూరుకు పూతలపట్టు తహసీల్దార్ విజయభాస్కర్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు.

తెలుగు వనంలో తులసీదళం

"తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను..తెలుగు వల్లభుండ తెలుగొకండ..ఎల్ల నృపులు గొలువ ఎరుగవే బాసాడి..దేశ భాషలందు తెలుగు లెస్స" అని శ్రీకృష్ణదేవరాయలవారు తెలుగు భాష ఉన్నతిని కొనియాడారు. అలాగే ఎందరో మహానుభావులు తెలుగుభాష ప్రత్యేకత, పరిరక్షణకు కృషి చేస్తున్నారు.ఆ బాటలోనే నడుస్తున్నారు తులసీనాథంనాయుడు. సుమారు 25 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ తాను సంపాదించినదంతా మాతృభాష పునరుజ్జీవానికే వినియోగిస్తున్నారు. పలమనేరులో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితిని స్థాపించి భాషాభివృద్ధికి అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ఆయన అడుగుజాడల్లోనే వారి సతీమణి పుష్ప సైతం ముందుకు సాగుతున్నారు.

- మాతృభాష పరిరక్షణే ధ్యేయంగా అడుగులు
- తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి స్థాపించి సేవలు
- సాహిత్యానికి పెద్దపీట వేస్తున్న తులసీనాథంనాయుడు


మహిళా రచయితలు, కవులను సన్మానించిన దృశ్యం (ఫైల్)



పలమనేరులోని కళామందిరం, తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి భవనం


పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి వేమన శతకం అందిస్తున్న తులసీనాథం నాయుడు (ఫైల్)


ఎమ్మెల్యే వెంకటేగౌడకు నీతిపద్యాల పుస్తకాన్ని అందిస్తున్న దృశ్యం (ఫైల్)

పలమనేరు : గంగవరం మండలం కీలపట్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తులసీనాథంనాయుడు దశాబ్దాలుగా తెలుగు భాష ఘనతను చాటేందుకు కృషి చేస్తున్నారు. తన భార్య నల్లగుట్లపల్లె ఎంపీపీ స్కూల్ టీచర్ పుష్ప సహకారంతో తెలుగు వెలుగులను అందరికీ పంచేందుకు శ్రమిస్తున్నారు.

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి

2012లో ఈ దంపతులు మరికొందరు ఉపాధ్యాయులు, సాహితీప్రియులతో కలసి పలమనేరులో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితిని స్థాపించారు. ఇందులో 50 మంది వరకు సభ్యులున్నారు. వీరు ఎప్పుడూ తెలుగు సంస్కృతిని చాటేలా సంప్రదాయ వస్త్రాలనే ధరిస్తుంటారు. ఏటా వేమన జయంతి, తెలుగుభాషాదినోత్సవం, అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం, ఉగాది వేడుకలు, ఉగాది పురస్కారాలు, వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన మహిళామణులకు సత్కారం చేస్తుంటారు. అలాగే కవులు, రచయితలు, బాషాభిమానులను క్రమం తప్పకుండా సన్మానిస్తుంటారు.

రూ.50 లక్షలతో కళామందిరం

తులసీనాథంనాయుడు దంపతులు సుమారు రూ.30 లక్షలు విలువైన తమ స్థలంలో రూ.20లక్షల సొంత నిధులు వెచ్చించి కళామందిరం పేరిట ఓ భవనం నిర్మించారు. ఇందులోనే తెలుగుభాష, సాహిత్యానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

చిత్తశుద్ధితో సేవలు..

ఇప్పటి వరకు సుమారు లక్ష కాపీల నీతి పద్యాల పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. 5 వేల పెద్ద బాలశిక్ష, 20వేల బాలభారతం, రామాయణం, భాగవతం తదితర పుస్తకాలను పిల్లలకు బహుమతులుగా అందజేశారు. వేమన పద్యాలపై నాలుగేళ్లుగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తెలుగుభాషకు అందిస్తున్న సేవలకు గాను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పురస్కారాలు అందుకున్నారు.

భాష పరిరక్షణే లక్ష్యం

తెలుగు భాష పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. మన సంస్కృతి, ఆచార వ్యవహారాలను భావితరాలు అందించాలని పట్టుదలతో కృషి చేస్తున్నాం. మాకు సహకరిస్తున్న తెలుగు భాషాభిమానులకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– తులసీనాథం నాయుడు, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు, పలమనేరు

తిరుపతి బులియన్
బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.55,500
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,400
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.70,000
రిటైల్ వెండి గ్రాము రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	24
తిరుపతి	37	25
తిరుమల	32	21
గూడూరు	37	26
నగరి	37	26

ట్యాంకర్ బోల్తా



చంద్రగిరి: ప్రమాదవశాత్తు కెమికల్ ట్యాంకర్ బోల్తా పడిన ఘటన సోమవారం భాకరాపేట కనుమలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. హిందూపురం నుంచి రేణిగుంటకు కెమికల్‌తో ట్యాంకర్ బయల్దేరగా.. భాకరాపేట కనుమలోని దెయ్యాలకోన వద్ద అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కర్నూలు జిల్లా, వెలుగోడుకు చెందిన డ్రైవరు జనార్దన్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. చంద్రగిరి ఎస్‌ఐ వంశీధర్, 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేర్వేరుచోట్ల కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్

పలమనేరు/బైరెడ్డిపల్లె : పలమనేరు రఘువీరారెడ్డి కాలనీలో సోమవారం సెబ్ అధికారులు దాడులు చేసి కర్ణాటక మద్యం విక్రయిస్తున్న జ్యోతి, మదన్‌కుమార్‌తోపాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 150 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు. అలాగే గంగవరం మండలం పెద్ద ఉగుని వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌లో కర్ణాటక మద్యం తరలిస్తున్న రాము(34) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెక్‌పోస్టు సీఐ మాధవస్వామి తెలిపారు. 40 టెట్రాప్యాకెట్లు సీజ్ చేశామన్నారు. బైరెడ్డిపల్లె మండలం బెల్లంమడుగులో ఆడెప్ప అనే వ్యక్తి కర్ణాటక మద్యం అమ్ముతుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటనరసింహులు వెల్లడించారు. నిందితుడి నుంచి 33 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కలెక్టరేట్ స్పందనకు 349 వినతులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మొత్తం 349 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ మేరకు కుప్పం ఏరియా ఆస్పత్రిలో నవజాతి శిశువులు అనారోగ్యం పాలైనట్లుగా చిత్రీకరిస్తున్నారని కుప్పం ప్రజావేదిక సభ్యులు వేణు, మహేశ్, మునిరాజు, నవీన్ ఫిర్యాదు చేశారు. దీనిపై జేసీ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరోగ్యంగా జన్మించినప్పటికీ పిల్లలకు పచ్చకామెర్లు, రక్తం సెప్టిక్ కావడం వంటి రోగాలు వచ్చినట్లు తల్లిదండ్రులకు చెబుతున్నారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలున్నప్పటికీ పరీక్షలన్నీ ప్రైవేట్ ల్యాబ్‌లో చేస్తున్నారని ఆరోపించారు. కేవలం కమీషన్ కోసం వైద్యులు ఇలాంటి దందాలకు అండగా నిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫిర్యాదుపై వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను జేసీ ఆదేశించారు.


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ వెంకటేశ్వర్

పెంచలకోన దేవస్థానానికి భారీ రాబడి

రాపూరు: పెంచలకోన దేవస్థానానికి ఒక కోటి, రెండులక్షల, ముప్పై రెండువేల మూడు వందల, ఎనభై రూపాయల ఆదాయం వచ్చినట్టు ఈఓ జనార్దన్ రెడ్డి, జిల్లా ఎండోమెంట్ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం దేవస్థాన అలంకారమండపంలో హుండీ కానుకలను లెక్కించగా.. నగదుతోపాటు 360 గ్రాముల బంగారం, వెండి 4 కిలోల 800 గ్రాములు, యూఎస్‌ఏ డాలర్లు 89, కువైట్ దినార్లు 52, బహరిన్ దినార్ 1, మలేషియారింగిట్స్ 11, ఇంగ్లండ్ ఫైన్లు 25 వచ్చినట్లు వివరించారు. శ్రీవారి నిత్యాన్నదానంలోని హుండీలో రూ.3,85,908 వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ మొత్తం 86 రోజులకు చెందినదని వారు వెల్లడించారు.

నిబంధనల మేరకే పంచనామా


మాట్లాడుతున్న ఈఓ సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో మూలవిరాట్ తొలగింపు సందర్భంగా నిబంధనల ప్రకారమే పంచనామా నిర్వహించామని ఈఓ సాగర్ బాబు తెలిపారు. ఆలయ పరిపాలనా భవనంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆలయ మూలవిరాట్ తొలగింపులో విపక్షాలను పిలవలేదన్న అక్కసుతో అక్కడ లభించిన బంగారాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హైదరాబాద్‌లో అమ్ముకున్నారంటూ టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై ఆయన స్పందించారు. స్వామివారి మూలవిరాట్ తొలగింపు విషయాన్ని నాలుగు రోజుల ముందు ప్రకటించామని చెప్పారు. అందరి సమక్షంలో మూలవిరాట్‌ను నిబంధనలకు అనుగుణంగా తొలగించామన్నారు. సీసీకెమెరాల నిఘాలోనే పంచనామా నిర్వహించామన్నారు. బంగారు, వజ్రాలు దొరికాయంటూ టీడీపీ నేత చేసిన ఆరోపణలు అసత్యమన్నారు. ఇలాంటి ఆరోపణలపై దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అర్చకుడు మాట్లాడుతూ ఆలయ మూలవిరాట్ తొలగింపునకు పీఠాధిపతులు వంటి వారు రారని, అందరి సమక్షంలోనే పంచనామా నిర్వహించి మూలవిరాట్‌ను పానవట్టం నుంచి తొలగించామని తెలిపారు. అందులోని బంగారు, నవరత్నాలు, రాగిరేకులను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచినట్టు వెల్లడించారు. అనంతరం వీఆర్వో బాల మురళి తాను చూసిన దాన్ని చూసినట్టు వివరించగా.. పాలకమండలి సభ్యులు జయశ్యామ్‌రాయల్ ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తే శ్రీకాళహస్తిలో తిరగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో మల్లికార్జున్, మురళీధర్‌రెడ్డి, లోకేష్, సతీష్‌మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం వచ్చి.. కానరాని లోకాలకు..


- రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ వాసి దుర్మరణం

మదనపల్లె(అన్నమయ్య జిల్లా) : ఉపాధి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు.. పుంగనూరు మండలంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ వాసి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని బల్లాపూర్ జిల్లా కుర్వపూర్వ గ్రామానికి చెందిన కాంతప్రసాద్ కుమారుడు రాజేష్(23) కొంత కాలం క్రితం పుంగనూరు మండలం ఈడిగపల్లె వద్ద ఉన్న రైస్‌మిల్లులో ఉపాధి కోసం వచ్చాడు. ఇతను ఆదివారం రాత్రి పుంగనూరుకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. తిరిగి వచ్చేటప్పుడు భీమగానిపల్లె వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గుంతలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన రాజేష్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మృతులు రైల్వే కోడూరువాసులు
- వరుసకు అన్నదమ్ములు


షేక్ ఇబ్రహీం, షేక్ మహమ్మద్ ముషబర్ బాషా(ఫైల్)

రేణిగుంట: రేణిగుంట–రైల్వే కోడూరు మార్గంలో కుక్కలదొడ్డి సమీపాన దివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. రేణిగుంట ఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన షేక్ ఇబ్రహీం (21), షేక్ మహమ్మద్ ముషబర్ బాషా(30) వరుసకు అన్నదమ్ములు. ఎంజీ రోడ్డులో ఇబ్రహీం చెప్పుల దుకాణం, మహమ్మద్ ముషబర్ బాషా దుస్తుల దుకాణం నడుపుతున్నారు. మహమ్మద్ ముషబర్ బాషాకు వివాహమై ఏడాదిన్నర వయస్సు కలిగిన కుమారుడు ఉన్నాడు. ఇబ్రహీంకు ఇంకా వివాహం కాలేదు. సోదరులైన వీరిద్దరూ ఆదివారం చెన్నైలోని తమ బంధువుల వద్ద ఓ మోటార్‌బైక్, సెల్‌ఫోను కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై ఆదివారం ఉదయం చెన్నైకి బయల్దేరారు. చెన్నైకి చేరుకుని అక్కడ బేరం కుదరకపోవడంతో కేవలం సెల్‌ఫోను మాత్రమే తీసుకున్నారు. ఆదివారం రాత్రి స్వస్థలానికి తిరుగు పయనమయ్యారు. అర్ధరాత్రి 12గంటల సమయంలో రేణిగుంట మండలం కుక్కలదొడ్డి సమీపంలోని దర్గా వంతెన వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మహమ్మద్ ముషబర్ బాషా తల, మొండెం వేరై తునాతునకలుగా ఛిద్రమై పడిపోయాయి. సమాచారం అందుకున్న రేణిగుంట పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. మృతుల బంధువులకు సమాచారం అందించడంతో వారు మార్చురీకి చేరుకుని భోరున విలపించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఏడుగురికి రిమాండ్

తిరుపతి లీగల్ : గంజాయి కేసులో ఏడుగురికి ఏప్రిల్ 10వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్‌సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం ఆదేశాలు జారీచేశారు. తిరుమల ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐకి ఈనెల 26వ తేదీన ఓ వ్యక్తి ఫోన్ చేసి ఓ వ్యక్తి తిరుమలకు గంజాయి తీసుకెళుతున్నాడంటూ సమాచారం ఇచ్చాడు. తిరుపతి అలిపిరి సమీపంలోని సప్తగిరి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. ఓ వ్యక్తి తప్పించుకోవడానికి ప్రయత్నించగా సీఐ అతన్ని అదుపులోకి తీసుకున్నాడు. విచారణలో తిరుపతి మంగళం క్వార్టర్స్‌కు చెందిన జి.గంగాద్రిగా తేలింది. అతని వద్ద 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కరకంబాడి తారకరామానగర్‌కు చెందిన వి.సక్కూబాయ్ అనే మహిళ వద్ద గంజాయి కొన్నట్టు తెలిపాడు. దీంతో ఆమె ఇంటిలో తనిఖీలు నిర్వహించి రూ.1.5 లక్షల విలువైన ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే మంగళం బీటీఆర్ కాలనీ చెందిన ఎం.సూర్యప్రకాష్, మిద్దిళ్లుకు చెందిన తిమ్మప్పమహేష్, తిరుమలకు చెందిన బి.రంజన్‌కుమార్ అలియాస్ సునీల్, జార్ఖండ్‌కు చెందిన అమిద్‌కుమార్‌యాదవ్, టీ సదుంకు చెందిన తళారి శివకుమార్ వద్ద 50 గ్రాముల చొప్పున గంజాయి ఉండడాన్ని గుర్తించారు. ఏడుగురిపై కేసులు నమోదు చేసి సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.